క్లుప్తంగా

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి


నమూనాలను పరిశీలిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ నలంద హైస్కూల్లో శుక్రవారం రెండవ రోజు విద్య వైజ్ఞానిక సంబరాలు జరిగాయి. విద్యార్థులు చేసిన ప్రాజెక్టుల నమూనాలను ఆయన పరిశీలించారు. అనంతరం అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానం చేరుకోవడానికి క్రమశిక్షణ అవసరమన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం నిర్దేశించుకొని లక్ష్య సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక మెడికల్ ఆఫీసర్ సాయి వరప్రసాద్, అక్షర పాఠశాల కరస్పాండెంటు బాబు, శ్రీనలంద పాఠశాల కరస్పాండెంటు వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం


వివరాలు వెల్లడిస్తున్న ఎంఈఓ పద్మజ

ఓబులవారిపల్లి: ప్రభుత్వ నిబంధనల మేరకు 2024 – 25 విద్యా సంవత్సరానికి గాను ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ పద్మజ కోరారు. శుక్రవారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ జీఓ నెంబరు – 63 ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం ఎస్సీ, ఎస్టీ, బడుగు, బలహీన, బీసీ, మైనార్టీ, ఓసీ, అనాథ, దివ్యాంగులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు ఈనెల 5 నుంచి 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు 14417ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిన వెబ్‌సైట్ సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ అని తెలియజేశారు.

నాడు - నేడుపై సమీక్ష


ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఎంఈఓలు

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు చక్రధర్ రాజు, నాగా తిరుమలరావుల ఆధ్వర్యంలో పుల్లంపేట మండల పరిధిలోని 24 ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో నాడు – నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. నాడు – నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను వారు ఆదేశించారు. పోలింగ్ బూత్‌లు కల్గిన పాఠశాలలో త్వరితగతిన మరమ్మతులు నిర్వహించాలన్నారు. వాటర్, విద్యుత్, టాయిలెట్స్ తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూత్ మేరీ, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తాం


నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

రాయచోటి అర్బన్ : మాదిగ అమరవీరుల ఆశయాలను కొనసాగిస్తామని రాష్ట్ర ఎమ్మార్పీస్ కో – కన్వీనర్ రామాంజులు మాదిగ అన్నారు. శుక్రవారం రామాంజులు ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ ఉద్యమంలో భాగంగా చాలా మంది మాదిగవీరులు అమరులయ్యారని తెలిపారు. వారి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు సామాజిక న్యాయం లభిస్తుందన్నారు. మాదిగలంతా అమరవీరుల ఆశయ సాధన కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, నేతలు రామయ్య, వెంకటరమణ, సుబ్బయ్య, ఆంజనేయులు, జమరాం, గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పూర్తి చేయండి

వాల్మీకిపురం: రైతులు పండించిన పంటలకు మార్చి 4వ తేదిలోపు ఈ–క్రాప్ నమోదు పూర్తి చేయాలని వాల్మీకిపురం వ్యవసాయ శాఖ ఏడీఏ వాణిశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు ఫిబ్రవరి 28వ తేది గడువు ముగియడంతో, ప్రభుత్వం మళ్లీ మార్చి 4వ తేది వరకు పొడిగించిందన్నారు. ప్రతి రైతు వారు పండించిన పంటలను ఆయా పంచాయతీల్లోని ఆర్‌బీకే కేంద్రాలకు వెళ్లి ఈ–క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

- రాజంపేట, రైల్వేకోడూరుల్లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ
- అందజేసిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల, జెడ్పీ చైర్మన్ ఆకేపాటిలు


రైల్వేకోడూరు అర్బన్: చెక్కులను అందిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్‌లు


రాజంపేట రూరల్: బాధితులకు చెక్కులను అందజేసిన జెడ్పీ చైర్మన్ ఆకేపాటి

రాజంపేట రూరల్ : సీఎం సహాయనిధి పేదలకు వరమని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమరనాథరెడ్డి తెలియజేశారు. మండల పరిదిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో శుక్రవారం రూ.12లక్షల 45వేలు విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధితులకు ఆకేపాటి అందజేశారు. రాయచోటి మండలం జగదాంబ వీధికి చెందిన తాండ్ర సుబ్బలక్ష్మికి రూ.5 లక్షలు, రాజంపేట మండలంలోని చింతలకోన గ్రామానికి చెందిన వెంకటరామ్‌కు రూ.3లక్షలు, రాజంపేట మండలంలోని హస్తవరం గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్‌కు రూ.1లక్ష, రాజంపేట పట్టణ పరిధిలోని మన్నూరుకు చెందిన సుధాకర్‌కు రూ.80వేలు, రాజంపేట మండల పరిదిలోని పోలి గ్రామానికి చెందిన కృష్టారెడ్డికి రూ.70వేలు, సుండుపల్లి మండలం ముడుంపాడు కురవపల్లికి చెందిన రమేష్‌కు రూ.70వేలు, రాజంపేట మండలం ఆకేపాడు పెద్దూరు గ్రామానికి చెందిన కరిముల్లాకు రూ.60వేలు, నందలురు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నితీష్‌కుమార్ రూ.50వేలు, రాజంపేట మండలం విద్యుత్‌నగర్‌కు చెందిన నయమున్నీసా రూ.15వేలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ విభాగాల కన్వీనర్లు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : అనారోగ్య పీడితులైన పేద ప్రజలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో రూ.13.60లక్షలు విలువ చేసే చెక్కులను నలుగురికి పంపిణీ చేశారు. ఓబులవారిపల్లెకు చెందిన స్నేహకు రూ.1.50లక్షలు, గడ్డం పార్వతమ్మకు రూ.80వేలు, చిట్వేలి మండలానికి చెందిన తిరుమలరెడ్డి ప్రణీతకు రూ.11లక్షలు, నాయినాల తిరుమలేశుకు రూ.30వేలు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి ఎంతో ఆసరాగా నిలుస్తోందన్నారు. నియోజకవర్గంలో ఎన్నడూ అందని విధంగా సీఎం సహాయనిధి నుంచి బాధిత కుటుంబాలకు లబ్ధి చేకూర్చి అండగా నిలిచామని వారు పేర్కొన్నారు. అనంతరం రైల్వేకోడూరు రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన సీఐ పి.సురేంద్రనాథరెడ్డి శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ సాయికిషోర్‌రెడ్డి, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఎల్‌వీ మోహన్‌రెడ్డి, మలిశెట్టి వెంకటరమణ తదితర నాయకులు పాల్గొన్నారు.

వీరబల్లెలో..

వీరబల్లె (రాయచోటి టౌన్) : బాధిత కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆసరాగా నిలుస్తోందని వీరబల్లె ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మట్లి పెద్దూరు తండా పెద్ద వెంకటరమణకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.5లక్షలు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా బీసీ అధ్యక్షులు మోడెం నాగభూషణం, రామాంజన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరెం రెడ్డి, నరేంద్ర,పెంచలయ్య, రమేష్‌లు పాల్గొన్నారు.


వీరబల్లెలో లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి తదితరులు

ఈ-క్రాప్ వివరాలు వెల్లడించాలి

లక్కిరెడ్డిపల్లె : రబీలో సాగు చేసిన పంటలకు ఈ – క్రాప్ బుకింగ్ నమోదు వివరాలను గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతుల సమక్షంలో వెల్లడించాలని లక్కిరెడ్డిపల్లి వ్యవసాయ సహాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి డివిజన్ పరిధిలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లి, గాలివీడు, వీరబల్లి మండలాల్లో 9423 ఎకరాలకు ఈ–క్రాప్ బుకింగ్ చేయించాలన్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు వివరాలు తెలియజేసి ఆర్‌బీకే కేంద్రాలలో నమోదు జాబితాను ప్రదర్శించాలన్నారు. ఈ పంట నమోదులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలుసుకొని వాటిని పరిష్కరించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

త్రికాల పూజలు

కడప కల్చరల్ : కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీస్వామి శుక్రవారం కడప నగర శివార్లలోని శ్రీ లలితా పంచాయతన ఆలయంలో త్రికాల పూజలు, అభిభాషణం చేశారు. తన విజయయాత్రలో భాగంగా ఆయన గురువారం నుంచి ఆలయంలో పూజోత్సవాలు నిర్వహిస్తున్నారు. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు స్వామి తురియానంద పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్వామి శంకర విజయేంద్ర సరస్వతి శ్రీ చంద్రమౌళేశ్వరస్వామి స్ఫటిక శివలింగం రూపానికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు, ప్రముఖులు స్వామిజీని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

భరత్ మరణం పార్టీకి తీరనిలోటు

రోడ్డు ప్రమాదంలో మరణించిన భరత్‌కుమార్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


భరత్ పాడె మోస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా సోషల్ మీడియా కో–కన్వీనర్ మలసాని భరత్‌కుమార్‌రెడ్డి అంత్యక్రియలు ముగిశాయి. మండలంలోని అరవీడు గ్రామం కసిరెడ్డిగారిపల్లెలో శుక్రవారం జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానం, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా వలంటీర్లు భారీగా పాల్గొని భరత్‌కు తుది వీడ్కోలు పలికారు. ఇంటి నుంచి బయలుదేరిన అంతిమయాత్రలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాడె మోశారు. భరత్ మరణవార్త తెలిసినప్పటి నుంచి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నీ కార్యక్రమాలను దగ్గరుండి పర్యవేక్షించారు. భరత్ తల్లిదండ్రులను ఓదారుస్తూ శ్రీకాంత్‌రెడ్డి కంటతడిపెట్టారు.

కుటుంబ సభ్యులను ఓదార్చిన శ్రీకాంత్‌రెడ్డి

మలసాని భరత్ ఆకస్మిక మరణం పట్ల శ్రీకాంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వైఎస్ఆర్‌సీపీ సోషల్ మీడియాలో మలసాని భరత్ నిబద్ధతతో చురుగ్గా వ్యవహరించేవారన్నారు. భరత్ కుటుంబసభ్యులు ఈ విషాదాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు.

ఎంపీ మిథున్‌రెడ్డి సంతాపం

మలసాని భరత్ మృతి పట్ల ఎంపీ మిథున్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే మృతిచెందడం విచారకరమన్నారు. సోషల్ మీడియాలో పార్టీని బలోపేతం చేయడంలో అతని పాత్ర మరువలేనిదన్నారు. లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, యదుభూషణ్‌రెడ్డి, ఎస్‌కే ఖాదర్‌మొహిద్దిన్, ఆవుల నాగభూషణ్‌రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, బేపారి మహమ్మద్‌ఖాన్, విజయభాస్కర్, పోలి ప్రవీణ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు.

పరామర్శ

పెనగలూరు (ఓబులవారిపల్లె): మండలంలోని సిద్ధవరం పంచాయతీ తిరుమలరాజుపేటకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రెడ్డయ్య గురువారం రాత్రి మృతి చెందడంతో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, సర్పంచ్ ప్రేమలతారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

ఓబులవారిపల్లె : జిల్లాస్థాయిలో నిర్వహించిన సైన్స్ ఎక్స్‌పోలో చిన్నఓరంపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ఆదివారం రాయచోటి ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలలో డిస్ట్రిక్ట్ లెవల్ సైన్స్ ఎక్స్‌పో – 2024లో విద్యార్థులు తమ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో చిన్నఓరంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనకు మొదటి స్థానం లభించింది. డైట్ కళాశాల ప్రిన్సిపాల్ అజయ్ బాబు, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డిలు విద్యార్థులు కె.వెంకట సుబ్బయ్య, పి.వినయ్‌లకు బహుమతులు అందజేశారు. అలానే వీరు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

బి.కొత్తకోట : కర్ణాటకలోని గొనిపల్లెకు చెందిన జీకే. మహమ్మద్‌రఫీ మండలంలోని కనికలతోపు రైల్వే ట్రాక్ వద్ద మద్యం తరలిస్తుండగా అరెస్ట్ చేశామని ఏఎస్ఐ బొజ్జేనాయక్ శుక్రవారం తెలిపారు. ఇతని నుంచి 144 ప్యాకెట్ల మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసామని తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సీఎం వైఎస్ జగన్‌తోనే సుపరిపాలన

సచివాలయం ప్రారంభోత్సవంలో ఏపీఎస్‌డీసీ చైర్మన్ అజయ్ రెడ్డి


సచివాలయాన్ని ప్రారంభిస్తున్న అజయ్ రెడ్డి

పెనగలూరు (ఓబులవారిపల్లె): గ్రామస్థాయి నుంచి పరిపాలన చేయాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సిద్ధవరంలో స్థానిక సర్పంచ్ రాఘవరెడ్డి ప్రేమలతా రెడ్డితో కలసి సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యాన్ని కార్యరూపంలోకి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. 2 వేలు జనాభా ఉన్న గ్రామాలలో ఒక సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి పాలన సాగిస్తున్నారన్నారు. గతంలో రైతులు తమ పంట పొలాలకు ఎరువులు, పురుగు మందులు తెచ్చుకోవాలంటే ఎన్నో ఇబ్బందులు పడేవారని చెప్పారు. జగన్ హయాంలో రైతులకు కావాల్సిన అన్ని సేవలను ఆర్బీకేల ద్వార అందజేస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో సుపరిపాలన కావాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని అజయ్‌రెడ్డి అభ్యర్థించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, కర్లం కుల్లాయి నాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, కాకతీయ వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు రామ్మోహన్ రెడ్డి, చొప్పా నరసింహారెడ్డి, శంకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


సంబేపల్లె: పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు


నందలూరులో పరీక్షకు హాజరైన విద్యార్థులు

నందలూరు(రాజంపేట): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎగ్జామినేషన్ చీఫ్ సమత మాట్లాడుతూ తెలుగు పేపర్ – 1కు 264 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉండగా 259 మంది విద్యార్థులు హాజరు కాగా 5 మంది గైర్హాజరయ్యారన్నారు. హిందీ పేపర్–1కు 11 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిపార్టుమెంటల్ ఆఫీసర్‌గా ఉమాదేవి వ్యవహరించారని తెలిపారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేశారన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండల పరిధిలోని ఎర్రగుంటల సమీపంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల కళాశాలలో శుక్రవారం ఇంటర్ పరీక్షలు రాజ్ కుమార్ పర్యవేక్షణలో ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్ష కేంద్రంలో చిన్నమండెం, సంబేపల్లె, దేవపట్ల, ఎర్రగుంట్ల కళాశాలకు సంబంధించి 293 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 292 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంబేపల్లె పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఆర్బీకేలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


మిరప పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

సిద్దవటం : రైతు భరోసా కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజు సిబ్బందికి సూచించారు. మండలంలోని బొగ్గిడివారిపల్లి రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతు భరోసా కేంద్రంలోని ఈ – పంట నమోదు రిజిస్టర్, ఎరువుల పంపిణీ రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. నాగరాజు మాట్లాడుతూ రైతులు డ్రిప్ పరికరాలు, పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు, కల్లం పట్టలు యంత్ర పరికరాలు సబ్సిడీపై కావాలని అడిగారన్నారు. ఆర్బీకేలను పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. రైతులతో కలిసి క్షేత్రస్థాయిలో మిరప, నువ్వుల పంటలను పరిశీలించి మిరపలో ఆకు ముడత వైరస్ తెగులు సోకిందని, దీని నివారణకు డిలిగేట్ అనే మందును పిచికారీ చేసుకోవాలని తెలిపారు. జిగురు పూసిన పసుపు, నీలం పల్లాలను ఎకరాకు 40 చొప్పున పంట పైభాగం అర అడుగు ఎత్తులో ఉంచితే రసం పీల్చు పురుగుల నివారణకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈనెల 2న ఈ–పంట నమోదుపై సోషల్ ఆడిట్ నిర్వహించి రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు స్వీకరించాలన్నారు. ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

పోలియో రహిత సమాజానికి కృషి చేద్దాం


రాజంపేట: పోస్టర్లను విడుదల చేస్తున్న పోలా


సంబేపల్లె: ప్రచార కార్యక్రమంలో వైద్య సిబ్బంది

రాజంపేట : పోలియో రహిత సమాజానికి కృషిచేద్దామని మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో తన చాంబరులో పల్స్ పోలియో కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో మహమ్మారిని పారదోలేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా పల్స్ పోలియోను నిర్వహిస్తోందన్నారు. పల్స్‌పోలియోను విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సీహెచ్ కృష్ణ మాట్లాడుతూ రాజంపేట అర్బన్‌లో 31 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 0 – 5 సంవత్సరాలలోపు పిల్లలందరికి తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని సమన్వయంతో వైద్య సిబ్బంది విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, వైద్యులు లక్ష్మీప్రసన్న, అశోక్ చైతన్య, పీపీ యూనిట్ సీనియర్ అసిస్టెంట్ ఉప్పు సిద్దిరామయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : ఆదివారం జరగబోవు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి డాక్టర్ సుమలత పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలోని మూడు రోడ్ల కూడలిలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సున్నా నుంచి ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. నిండు ప్రాణానికి రెండు చుక్కలు ఆధారమన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు, బడి బయట పిల్లలకు, బస్సులో ప్రయాణం చేసే పిల్లలకూ పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ దేవదానం, సూపర్‌వైజర్ సురేంద్రనాథ్ రెడ్డి, మణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.


లక్కిరెడ్డిపల్లె: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది తదితరులు

పోలియో చుక్కలు తప్పనిసరి

సంబేపల్లె : పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపు ఉన్న చిన్నారులకు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని వైద్యుడు సూర్యనారాయణ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం గున్నికుంట్ల, గురిగింజకుంట, దుద్యాల తదితర గ్రామాలలో పల్స్ పోలియో చుక్కలపై అవగాహన, ప్రచారాన్ని నిర్వహించారు. మార్చి 3వ తేదీ వారివారి గ్రామాలలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నందలూరు(రాజంపేట) : విద్య, వైజ్ఞానిక రంగాలతోపాటు కలలకు కానాచి నందలూరు ప్రజ్వరిల్లుతోందని రైల్వే సీనియర్ మెడికల్ ఆఫీసర్ బచ్చు జయభాస్కర రావు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం రాత్రి ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట సామ్రాజ్ ఆధ్వర్యంలో రాజంపేట పార్లమెంట్ పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో వ్యాస రచన, క్విజ్, సైన్స్ ఫెయిర్, చిత్రలేఖనం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా న్యాయవాది ఆనంద్ కుమార్, ప్రభుత్వ వైద్యులు హీరేంద్ర సింగ్, ఉప్పుశెట్టి సుధీర్, వేణుగోపాల్ నాయుడు, కంభం జితేంద్ర కుమార్, కుర్ర మణి యాదవ్, మోడపోతుల రాము, కానకుర్తి వెంకటయ్య, గుండు సురేష్, గంధం గంగాధర్, గురుప్రసాద్‌లు హాజరయ్యారు. న్యాయ నిర్ణేతలుగా స్వర్ణాంధ్ర సంస్థ డైరెక్టర్ అభిషేక్, డ్యాన్సు మాస్టర్ బొజ్జ అభిరామ్‌లు వ్యవహరించారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్యగారి పల్లె సమీపంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో.. సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. స్థానికుడైన వెంకటరమణ అలియాస్ చిన్నబిడ్డ సారా విక్రయిస్తుండగా, అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

జేఎన్టీయూ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు

కలికిరి : కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఏ గ్రేడ్ గుర్తింపు లభించినట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత నెలలో న్యాక్ టీం జేఎన్టీ యూనివర్సిటీ అనంతపురం, అనుబంధ కళాశాలల్లో పర్యటించిందని, యూనివర్సిటీతో పాటు కళాశాలల్లో నాణ్యతా ప్రమాణాలు, బోధనాతీరు, పరిశోధన విభాగాలు, ఇతర మౌలిక వసతులపై టీం పరిశీలించి నివేదిక ఆధారంగా యూనివర్సిటీ, అనుబంధ కళాశాలలకు న్యాక్ ఏ గ్రేడ్ ప్రకటించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. న్యాక్ గ్రేడ్‌తో కళాశాల అభివృద్ధికి మరిన్ని నిధులు సమకూరుతాయని, విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు.

కమనీయం.. లక్ష్మీనరసింహుడి కల్యాణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహాస్వామి వారి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్నీ ఆకట్టుకొంది. ముత్యాల తలంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రవేశాలకు ఆహ్వానం

చిన్నమండెం : ఏపీ ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఈ నెల 3 నుంచి దరఖాస్తులు, ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు పత్రాలను తమకు అందజేయాలన్నారు.